కథ

# అమ్మ

పులిపాక
శ్రీరామచంద్రమూర్తి

శాస్త్రులుగారు వచ్చారు, ఐదేళ్ళ క్రితం చనిపోయిన నాగరత్నమ్మ సంవత్సరీకం నిర్వహించడానికి.

నాగరత్నమ్మ పెద్దకొడుకు జనార్ధనరావు ఆయన్ని గేటు దగ్గరే చూసి ఆహ్వానించాడు.

"రండి, రండి శాస్త్రులుగారూ ......"

శాస్త్రులుగారు నవ్వాడు, విశాలంగా, నుదుటిమీద పంగనామాలు, వంటిమీద ఉత్తరీయం, తెలతెల్లగా మెరిసి పోతున్న ధోవతి, జుట్టులో కలిసి పోయేలా పెంచిన చిన్న పిలక, పెద్దబొజ్జ, కాళ్ళకి అకు చెప్పులు.. ముందు రెండు పళ్ళు పై పెదవిలోంచి బైట దాల్చి కొంచెం విచిత్రంగా మరి కొంచెం వికృతంగా ఉన్నాడాయన.

"అంతా సిద్ధమేనా?" అడిగాడాయన గేటు పక్కనే పెట్టిన మోపెడ్‌కి సరిగా తాళం వేశానా లేదా అని చూస్తూ.

"మీదే ఆలస్యం"

"మీవాళ్ళందరూ వచ్చినట్లేనా, ఇంకెవరన్నా రావాలా?"

"అందరూ వచ్చారు"

"ఏవిటోనండీ, మన ఆచారాలు, సంప్రదాయాలు భ్రష్టు పట్టి పోతున్నయ్... చాలా మంది బ్రాహ్మణ పుటక పుట్టి కూడా ఉపనయనాలే చేసుకోవడంలేదు. ఒక వేళ చేసుకున్నా జంధ్యాలు తీసి అవతల పారేస్తున్నారు."

"కలికాలం శాస్త్రులుగారూ.. కలికాలం" అన్నాడు జనార్ధనరావు షామియానా కింద ఆయనకి అభిముఖంగా కూర్చుంటూ.

"నెలమాసికాల్లేవు, సంవత్సరీకాలు లేవు ... మనిషి చచ్చినప్పుడు మాత్రం సంఘానికి భయపడి ఏదో నిమిత్త మాత్రంగా కర్మకాండ జరిపించి చేతులు దులుపుకోవడం....

"బాగా చెప్పారు... మా కింకా మా తల్లిగారి పట్ల గౌరవం ప్రేమ ఉన్నాయ్... అందుకే క్రమం తప్పకుండా సంవత్సరీకాలు పెడుతున్నాం...."




"మనకంటె మిగతా కులాలవాళ్ళే నయంగా కనిపిస్తున్నారు"

"బాగా చెప్పారు... అల్పాచమానం తర్వాత ఎంతమంది బ్రాహ్మలుకాళ్ళు కడుక్కుంటున్నారు చెప్పండి. అన్నీ వదిలేశారు ఏనాడో. ఈ పక్కన శూద్రులుంటున్నారు.

అన్నీ నిష్ఠంగా, శాస్త్రోక్తంగా చేస్తున్నారు. పైగా దైవభక్తి కూడా చాలా ఎక్కువ. మనము ఉన్నాం ఎందుకు?"

"బ్రాహ్మణజాతిని ఉద్ధరించడానికి మళ్ళీ ఎవరో మహానుభావుడు రావాల్సిందే. అప్పటి దాకా ఈ గందరగోళం, అస్తవ్యస్త పద్ధతులు తప్పవు మరి...." అన్నాడు శాస్త్రులుగారు.

ఏదో ఒక మహాద్భుతం చేసి తనకులాన్ని ఉద్ధరించాలని ఆయన అప్పుడప్పుడూ అను కుంటూ ఉంటాడు. బ్రాహ్మలు చెడిపోయారని, పతనావస్థకి చేరుకున్నారని భ్రష్టుపట్టి పోయారని అందువల్ల ఏదో రకంగా తను నడుం బిగించి పాతవైభవాన్ని, వైభోగాన్ని తిరిగి తీసుకురావాలని ఆయన అనుకుంటూ ఉంటాడు_ ప్రగాఢంగా. అయితే తన కులోద్ధరణ కార్యక్రమాన్ని, కట్టుకున్న భార్య పిల్లలే ఎగతాళి చేస్తుండటంతో ఆయన అవని మానేశాడు. తనవల్ల ఏంకాదు, ఎవరో గొప్పవాడు రావాల్సిందేనని సరిపెట్టుకుని బతుకు బండిని లాగిం చేస్తున్నాడు. శాస్త్రులు గారికి అయోధ్యలో గుడి కట్టాలనే ఉంది. బ్రాహ్మణ ఆధిక్యాన్ని ఆధిపత్యాన్ని పునరుద్ధరించాలనే ఉంది. మాతృదేశంలో మతపరమైన విప్లవం తీసుకురావాలనే ఉంది. అవన్నీ తను ఎలాగూ చేయలేదు కాబట్టి తన కుల పొగ్గు పెట్టే సభలు, సమావేశాలకి వెళ్ళి, అక్కడ వక్తల ఉపన్యాసాలు విని అదోరకమైన తృప్తి, ఆనందం అనుభవిస్తూ ఉంటాడు.

"ఎన్ని ఇబ్బందులున్నా మా నలుగురు అన్నదమ్ములదీ ఒకటే మాట, ఈ విషయంలో ... అందరం కలిసే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం..."

"శుభం ... భగవత్ కృపవల్ల మీకు అంతా మంచే జరుగుతుంది. నలుగురు అన్నదమ్ములూ కలిసి ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనందదాయకమే మీకూ, నాకూ కూడా."

జనార్థనరావు నవ్వుకున్నాడు.

తను తన తమ్ముళ్ళు ఏదో నిష్ఠగా, ప్రాచీన ఆచారాలు పద్ధతుల ప్రకారం సంవత్సరీకం జరపాలని నిర్ణయించుకున్నారా అసలు? లేదు లేదు.... ఇంటికి తనే పెద్ద దిక్కు కాబట్టి, ఇక ఎలాగూ తప్పనే తప్పదని చేస్తున్నాడు, ముఖ్యంగా సంఘ భయంవల్ల. తల్లిగారి సంవత్సరీకం ఈ సారి మా ఇంట్లో నిర్వహించాలని ఉందని ఉత్తరాలు రాస్తే వాళ్ళలో పెద్ద తమ్ముడు ఏమని రాశాడు?

"సొంత ఇల్లు కట్టించే ప్రయత్నంలో ఉన్నాను. నాకు వీలుకాదు. అయినా ఖర్చంతా భరిస్తానంటే నాకేం అభ్యంతరం లేదు. ఆ పూటకి అక్కడికొచ్చి నీకు చేదోడు వాదోడుగా ఉంటాను."

రెండోవాడేం రాశాడు?

"ఆబ్దీకాల మీద నాకు ఇదివరకున్న విశ్వాసం లేదు. మరీతప్పదనుకుంటే వస్తాను. మొత్తం ఖర్చంతా నీమీదవేయడం బాగుండదు కాబట్టి నేను రెండొందలు మాత్రం ఇస్తాను... ఏదో రకంగా సరి పెట్టుకోగలవు."

మూడోవాడు ఇంకొంచెం ముందుకు వెళ్ళాడు. "నేను కాలేజీ లెక్చరర్ని కదా! నాకసలు క్షణం తీరిక ఉండటంలేదు. తెల్లారు ఝామునించే ట్యూషన్లు చెబుతున్నాను. మళ్ళీ కాలేజి నించి వచ్చి రాత్రి తొమ్మిదింటి దాకా అదేపని. అందుకని నువ్వు ఉత్తరం రాశావు కాబట్టి, తప్పనిసరి (తద్దినం) కార్యక్రమం కాబట్టి వస్తాను. నా వాటా కింద




ఒక వందరూపాయలు మాత్రం ఇస్తాను..."

మొత్తం మీద ముగ్గురి ఉత్తరాల్లో సారాంశం ఖర్చంతా నువ్వే భరించమని. తన దగ్గర ఏమన్నా ధన రాశులున్నాయా, గుప్త నిధులున్నాయా?, సంఘభయం బంధువుల భయం వల్ల దిగాడు తప్ప. తనకీ చాలా ఖర్చులున్నాయ్. పెళ్ళి కెదిగిన పెద్ద కూతురుంది. ఎమ్సెట్ రాస్తున్న కొడుకున్నాడు. టెన్త్ చదువుతున్న రెండో కూతురు, ఖరీదైన స్కూలుకి వెళ్తున్న రెండో కొడుకున్నాడు. వీళ్ళచదువులకి ఖర్చుపెట్టాలి.. ఇంకోవైపు పెద్దపిల్లకి సంబంధాలు చూడాలి. ఇవి చాలవన్నట్లు తన భార్య అపార్ట్‌మెంట్ కావాలి కావాలని తెగపోరుతూ చెవి కొరికేస్తోంది. అసలే ఇన్ని ఇబ్బందులతో చస్తుంటే రాత్రిపూట మేడ మెట్ల మీంచి జారి, కాలికి ఫ్రాక్చరై ఆస్పత్రి ఖర్చు తడిసి మోపెడైంది. ఏం చేస్తాం? ఏది ఎలా ఉన్నా సంవత్సరీకం చెయ్యాల్సిందే.

అసలు ముగ్గురు తమ్ముళ్ళకీ ఉత్తరాలు రాయడంలో తన ఉద్దేశం వేరు. ఒరే అన్నయ్యా, ప్రతిఏడూ నువ్వే చేస్తున్నావుగదా, ఈ ఏడు మేం చేస్తామని ఎవరో ఒకరు రాయకపోతారా అని ఆశపడ్డాడు. కాని వాళ్ళు అలాంటి ప్రతిపాదనలేం చెయ్యలేదు. మొత్తం భారమంతా తన మీదే వేశారు. ఇప్పుడీ ఖర్చు పదిహేనొందల రూపాయల పైనే అవుతుంది. ఇందులో రెండోవాడు, మూడోవాడు మూడొందలిచ్చినా తనకి పన్నెండొందలు ఖర్చు. అసలే అన్ని వస్తువుల ధరలు మండిపోతున్న ఈ రోజుల్లో ఇంత డబ్బు ఖర్చు పెట్టడం అంటే మాటలా?

"తిథి ప్రకారమే పెడుతున్నారా?" అడిగాడు శాస్త్రులుగారు.

"అవునవును... రెండేళ్ళు నక్షత్రం ప్రకారం పెట్టాం. తర్వాత ఆ శాస్త్రిగారు శాస్త్ర సమ్మతం కాదంటే మానేసి తిథి ప్రకారం పెడుతున్నాం.'

' "ఇదే రైటు... పుట్టినరోజుని నక్షత్రం ప్రకారం, ఆబ్దీకాలు తిథిప్రకారం చెయ్యాలి... శాస్త్రం అలాగే చెబుతోంది."


"నేను శాస్త్రోక్తంగానే నడుచుకుంటాను..' ' అన్నాడు జనార్దనరావు, ఇప్పటివరకు తను ఏయే పనులు శాస్త్రోక్తంగా చేశాడో, చెప్పుకుంటూ "మంచిది, కాసింత నెయ్యి, బియ్యం, నువ్వులు తెప్పించండి."

"జయా, జయా..." కేకేశాడు జనార్దనరావు. ఆయన భార్య నిదానంగా భారంగా రెండొందల యాభై వ్యాగన్లున్న గూడ్సు రైలులా వచ్చి మళ్ళీ అలాగే ఇంట్లోకి వెళ్ళి శాస్త్రులుగారు చెప్పినవి తెచ్చి అందించి వెళ్ళిపోయింది.

శాస్త్రులుగారు పరమేశ్వర ప్రీత్యర్థం... అంటూ సంకల్పం చెప్పి శుద్ధి పుణ్యావాచనం చేసి, అరటికాయ, బెల్లం తెప్పించాడు. తర్వాత మాతృత్వం... గోత్రావాం... నాగరత్నమ్మ నామ శర్మణాం మాతుః ప్రత్యాబ్దీక శ్రాద్ధం... కర్మణి స్వస్తి, వైశ్వదేవం, స్వప్రీతయే, స్వయమేవ కారితవాన్... అని మంత్రాలు చదువుతూ

అకార్యక్రమంలో మునిగిపోయాడు. జనార్దన రావు పెద్ద తమ్ముడు జమదగ్ని గుమ్మం దగ్గరికొచ్చి శాస్త్రులుగారిని, అన్నని ఒకసారి పరిశీలించి, వాళ్ళు తననేం ఇబ్బంది పెట్టరని గ్రహించి ఆనందంగా లోపలికి వెళ్ళిపోయాడు, తెలుగు టీవీలో కెమెరా, మనుషులు కదలని దిక్కుమాలిన సింగిల్ ఎపిసోడ్ నాటిక చూడటానికి. అతను ఆడిటర్. అందువల్ల ప్రతిదాంట్లోనూ అకౌంట్స్ పరిశీలించిగాని తన నిర్ణయం ప్రకటించడు. అందుకే జనార్దనరావు ఉత్తరం రాయగానే, తల్లికి సంవత్సరీకం పెట్టడంవల్ల తనకి ఏ రూపేణా లాభం లేదని గ్రహించి, ఒక్క రూపాయి కూడా ఇవ్వనని ఖరాఖండీగా రాసేశాడు. అలా రాసినందుకు ఆనందించాడు కూడా. అతను ఆధునిక జీవన సూత్రాల ప్రకారం తన లెక్క ప్రకారం ఒక కొడుకు పుట్టగానే భార్యకి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించాడు. ఇప్పుడతను ఇల్లు కట్టిస్తున్నాడు. నాలుగు పోర్షన్లది. అదీ లెక్క ప్రకారమే. తను ఒక పోర్షన్లో ఉండి, మిగతా మూడూ అద్దెకిస్తే బ్యాంకు అప్పు తేలిగ్గా తీరిపోతుంది. అతనికేం ఇజాలు, నిజాలు, సిద్ధాంతాలు, రాద్ధాంతాలు లేవు. జీవితాన్ని కూడికలు, తీసివేతల మధ్య కుదించుకుని హాయిగా కాలక్షేపం చేస్తున్నాడు.

మూడోవాడు జగన్మోహనరావు. అప్పటికే దినపత్రిక చదివేసి ఇంకేం చెయ్యాలో తోచక పాతవారపత్రికల్లో సెక్సీ సెంట్రల్ సెన్సేషనల్ కథలు చదువుతున్నాడు. అతను హోమియో డాక్టర్. మన కొచ్చిన జబ్బు ఎప్పటికి తగ్గినా పరవాలేదు. ఎప్పటికీ తగ్గక పోయినా పరవాలేదనే సందర్భాల్లో మాత్రమే హోమియో వైద్యం చేయించుకోవచ్చని ఓ మిత్రుడు జోకేశాడు. జగన్మోహనరావు పెద్దగా నవ్వేశాడు. నిజం కూడా అంతేగామరి. పేరుకే హోమియో వైద్యంకాని జనాన్ని ఆకర్షించడానికి అతను అలోపతి వైద్యం కూడా చేస్తుంటాడు. అతనికి ముగ్గురూ మగపిల్లలే. వాళ్ళలో పెద్దవాడికి పోలియో వచ్చి ఒక కాలు చచ్చుబడి పోయింది. రెండోవాడికి నత్తి ఉంది. మూడోవాడు మాత్రం సజావుగానే ఉన్నాడు. డబ్బు ఎక్కువగా అనవసరంగా ఖర్చు పెట్టరాదనే జీవన సూత్రాన్ని జగన్మోహనరావు తుచ తప్పకుండా పాటిస్తున్నాడు. తల్లికి ఆబ్దీకం పెట్టడం కూడా నిజానికి అతనికి ఇష్టంలేదు. ఎందుకూ పోయినవాళ్ళు ఎలాగూ పోయారు. తద్దినాలు పెట్టినంత మాత్రాన తిరిగొస్తారా? అసలు మనం పెట్టే కార్ధం వల్ల ఉన్నాయో లేవో తెలిని వాళ్ళ




ఆత్మలకి శాంతి జరుగుతుందనే గ్యారంటీ ఏవుంది? ఆహా! జగన్మోహనరావుకి ఎంత హేతువాద దృక్పథం ఉందని సంతోషించడం చాలా తప్పు. డబ్బు ఖర్చు తప్పించుకోవడానికి అతను ఏ సిద్ధాంతాన్నయినా అనుసరిస్తాడు, చారిత్రక భౌతిక వాదంతో సహా... ఇప్పుడు తల్లి ఆబ్దీకానికి రెండొందలు ఇచ్చి సరిపెట్టేశాడు. మళ్ళీ రెండు నెలల్లో తండ్రి ఆబ్దీకం ఉంది. అప్పుడు మాత్రం ఒక పైసా కూడా ఇవ్వకూడదని కఠోర నిర్ణయం చేసేసుకున్నాడు.

ఆఖరివాడు జస్వంత్ ఒక్కడే కూర్చుని పేక ముక్కలతో ఠంకా పలాస్ ఆడుకుంటున్నాడు. అతను గవర్నమెంట్ కాలేజిలో కెమిస్ట్రీ లెక్చరర్. ఉదయం ట్యూషన్లు, సాయంత్రం ట్యూషన్లు చెప్పి (క్లాసు రూముల్లో మాత్రం ఏం చెప్పడు) బాగా సంపాదించాడు. అతనికి ముగ్గురూ ఆడ పిల్లలే. వాళ్ళ పెళ్ళిళ్ళ కోసం ఇప్పటి నుంచే కష్టపడుతున్నాడు. మధ్య మధ్యలో ఇలా ట్యూషన్లు ఎగ్గొడితే తన దగ్గర కొచ్చే విద్యార్థులు వేరే లెక్చరర్ దగ్గరికి వెళ్ళారేమోనని అతను భయపడుతుంటాడు. అసలే క్షణం తీరిక లేకుండా చస్తుంటే ఈ సంవత్సరీకాలు, తద్దినాలు ఒకటి. అతనికి చాలా చిరాకుగా, తలనొప్పిగా ఉంది కాని తప్పని సరి సందర్భమని వచ్చాడు అయిష్టంగానే. అందుకే ఆ చిరాకుని జయించడానికి ఒక్కడే కూర్చుని పేకాట ఆడుకుంటున్నాడు.

వరండాలో, ఇంటి ఆవరణలో నలుగురి అన్నదమ్ముల పిల్లలు కేరింతలు కొడుతున్నారు. నలుగురైదుగురు హైడ్ అండ్ సీక్ ఆడుకుంటున్నారు. వాళ్ళలో ఎవరికీ వాళ్ళ బామ్మ మొహం కూడా గుర్తు లేదు. ఆటలు పాటలతోనే సరిపెట్టేస్తున్నారు. "ఇవాళ మనం ఇక్కడి కెందుకొచ్చాంరా?" అడిగింది జస్వంత్ కూతురు.

"బామ్మ సంవత్సరీకంట" చెప్పాడు జనార్దనరావు చిన్న కొడుకు.

"అంటే ఏవిటి?" అడిగాడు జగన్మోహనరావు కొడుకు.

"కనిపించడంలా. బ్రాహ్మడువచ్చి మంత్రాలు చదివి బామ్మకి పిండం పెడతాడు.'

"పిండం అంటే?"

"అన్నం ముద్ద... గోడమీద పెడితే కాకి వచ్చి తినేస్తుంది."

"భలే, భలే...కాకి కెందుకూ పెట్టడం?"

"దానికి పెట్టక నీకు పెడతారా ఏమిటి? బామ్మ ఆత్మ కాకి రూపంలో వచ్చితింటుంది.'

"ఇదేదో వాల్ట్ డిస్నీ సినిమాలా ఉంది కదూ?" అన్నాడు వాడు. మిగతా పిల్లలందరూ పెద్దగా నవ్వేశారు.

"అయితే ఇదంతా అనవసరమని మా పెర్సీ మేడమ్ చెప్పింది"

"వాళ్ళు వేరు, మనం వేరు"

"ఏవో మరి... బామ్మ కాకిరూపంలో వస్తుందని గ్యారంటీ ఏవుంది?"

"వస్తుందిగా నువ్వే చూడు.."

పిల్లలందరూ ఆ దృశ్యం చూడాలని నిర్ణయించేసుకుని మళ్ళీ ఆటల్లో మునిగిపోయారు.

లోపల....

"వంట ఏం చేయిద్దాం?" అడిగింది జనార్దనరావు భార్య.

"అత్తగారికి హల్వా అంటే ఇష్టం. అది చేయిస్తే సరిపోతుంది." చెప్పింది జమదగ్ని భార్య.

"కాదే అక్కయ్యా.... ఆవిడకి బొబ్బట్లంటే చాలా ఇష్టం... అవే చేయిద్దాం.." చెప్పింది జగన్మోహనరావు భార్య.

"మా ఇంటికొచ్చినప్పుడు ఒకసారి బొబ్బట్లు చేస్తే అసలు ముట్టుకోలేదు తెలుసా?" అంది జస్వంత్ భార్య.




"కాని మా ఇంటికొచ్చినప్పుడు కావాలని బొబ్బట్లు చేయించుకుని తింది. అందుకని ఇప్పుడు బొబ్బట్లే చేయించాలి."

"కాదు హల్వాయే.."

"కాదు బొబ్బట్లే.."

"రెండూ వద్దు... పాయసం చేయిస్తే చాలు..."

"కాదు వనిలో వనిగా మూడూ చేయిద్దాం.. ఏదో సంవత్సరానికి ఒకసారి పెట్టేదేగా.. ఖర్చయితే అయింది..." అంది జనార్ధనరావు భార్య కొంచెం నిష్ఠూరంగా.

"సరే నీ ఇష్టం..."

"నా ఇష్టం కాక మీ ఇష్టమా ఏమిటి? ఖర్చంతా మానెత్తినే వేశారుగా."

"మా ఆయన రెండొందలిచ్చాడు తెలుసా?" అంది జగన్మోహనరావు భార్య.

"మా ఆయన వంద ఇచ్చాడు." గౌరవంగా చెప్పింది జస్వంత్ భార్య.

"మొత్తం ఖర్చు సమానంగా పంచుకోవాలిగాని ఇలా ముష్టి వేస్తారా ఏమిటి?" అంది జనార్ధనరావు భార్య కొంచెం కోపంగా..

ఒక మరిది అసలు ఇవ్వలేదు. మిగతా ఇద్దరూ కలిసి మూడొందలే ఇచ్చారు. మొత్తం ఖర్చు పదిహేనొందలు దాటేటట్టు ఉంది. దాంతో ఆమెకి మరదుల మీద కోపం వచ్చింది. ఆ ఆగ్రహాన్ని చాలా రోజులు అణిచి పెట్టుకుంది గాని చివరికి ఇలా బైటపడిపోయింది.

"వచ్చే ఏడు మా ఇంట్లోనే పెడతాంలే... అప్పుడు మీరేం పైసా కూడా ఇవ్వనక్కర్లేదు.'

' అంది జమదగ్ని భార్య ఓదార్పుగా.

దాంతో జనార్ధనరావు భార్యకి ఇంకా కోపం వచ్చింది.

"మేం మీలాగా కక్కుర్తి మనుషులం కాదు..."

"అంటే మేం కక్కుర్తి మనుషులమనా నీ ఉద్దేశం?" అడిగిందామె ఆవేశంగా.

"కనిపిస్తుంటే వేరే చెప్పాలా ఇంకా?"

"ఇన్ని మాటలు పడి ఇక్కడుండాల్సిన అవసరమేం లేదు. మేం వెళ్తాం..."

"వద్దులే... వెళ్తే బాగుండదు." సర్ది చెప్పింది. జగన్మోహనరావు భార్య.

"మీ పరువు కాపాడటానికి ఉంటాంలే..."

"ఎవరి పరువు వాళ్ళు కాపాడుకుంటారు. మా పరువు మీరేం కాపాడనక్కర్లేదు.."

"అది సరే, కూరలు ఏం చేయిద్దాం.." జస్వంత్ భార్య ప్రశ్నించింది సంభాషణ దారి మళ్ళించడానికి.

"వంకాయ, అరటికాయ కూరలు... పప్పు... గుమ్మడికాయ పులుసు..."

"మా అబ్బాయి గుమ్మడికాయ పులుసు వేసుకోడు..." అంది జమదగ్ని భార్య. ఆబ్దీకం ఖర్చులో తామేం వాటా వేసుకోలేదని, ఆ గిల్టీతోనే ఇలా ప్రతిదానికీ తగాదాకి దిగుతోందని జనార్ధనరావు భార్య అనుకుంది. ఆమె తగ్గనప్పుడు తనెందుకు తగ్గాలి?

"వేసుకోకపోతే మానెయ్యమను."

"సర్లే సర్లే ... వంట గురించి మాట్లాడండి తగాదాలెందుకు?" అంది జస్వంత్ భార్య. అత్తగారి సంవత్సరీకానికి వచ్చి ఇలా తగాదాలు పడటం ఆమెకేం నచ్చలేదు.

"మొత్తం పది ఐటమ్సు ఉండాలి. మవ్వ చెప్పింది ఆరే..."

"అయితే అప్పడాలు, వడియాలు వేయిద్దాం... ఇంకో ఫ్రై చేయిద్దాం... పాయసం, పులిహోర కూడా చేయిద్దాం..."

"అవేం వద్దు. తద్దినం రోజు ఆ రెండూ చెయ్యరు. పొంగలి చేస్తారు. దాంతో కలిపి మొత్తం తొమ్మిది వంటకాలతో సరిపెట్టేద్దాం...."

"ఈ సారి మేం మా సొంత ఇంట్లో పెట్టిస్తాం.. చూదు ఎలా చేస్తామో.." అంది జమదగ్ని భార్య మళ్ళీ తగాదాకి సిద్ధపడు తున్నట్టు

"మీ కేం ఇళ్ళు కడతారు. భవనాలూ కొంటారు. మాకేం ఉంది? అద్దె కొంపలో ఏడుస్తున్నాం..."

"ఎందుకూ ఏడవడం? మీరూ కట్టుకోండి."

మాదగ్గరేముంది...? మా ఆయన మామూలు గుమాస్తా..."

"పై సంపాదన బాగానే ఉందిగా... లేకపోతే ఫ్రిజ్, కలర్ టీవీ ఎక్కడి నుండి వస్తాయి.."

"అంటే మీ బావగారు తప్పుడు మనిషనా నీ ఉద్దేశం..?"

"ఏమోనాకేం తెలును... వాళ్ళూ వీళ్ళూ అనే మాటలే చెబుతున్నాను..."

సంభాషణ దారి మళ్ళుతోందని, ఇది చాలా ప్రమాదస్థాయికి చేరుకునే అవకాశం ఉందని జస్వంత్ భార్య గమనించింది. దాంతో ఎలాగైనా చల్లబరచాలని అనుకుంది.

"అత్తగారి ఆబ్దీకం రోజున చాలా రోజుల తర్వాత కలుసుకున్నాం... ఈ సూటి పోటీ మాటలు, తగాదాలు ఎందుకు చెప్పండి. వంట పని చూద్దాం పదండి..."

"నేనేం మాట్లాడలేదు నిష్ఠూరంగా... నీ అక్కయ్యే ముందు మొదలు పెట్టింది" అంది జనార్ధనరావు భార్య నిష్ఠూరంగానే.

"సరే పదండి... అసలే ఆడపిల్ల ఉన్నవాళ్ళం... అణిగి మణిగి ఉండాలి కదా...'

' అంది జగన్మోహనరావు భార్య, మిగతా ముగ్గురి కంటె తనే ఎక్కువ కష్టాలు పడుతున్నానని పరోక్షంగా తెలియచేస్తూ. "

అలా అనుకుంటే నాకు ముగ్గురూ ఆడపిల్లలే'

' అంది జస్వంత్‌భార్య నవ్వుతూ.

నలుగురు లేచి వంటపని పర్యవేక్షించడానికి పెరట్లోకి వెళ్ళారు. పైకి ఎన్ని నీతి సూత్రలు చెప్పినా, తమలో ఒకరిపట్ల ఒకరికి అసూయ ఉందని జస్వంత్ భార్య అనుకుంది. జమదగ్ని ఇల్లు కట్టిస్తున్నాడని తమకి అసూయగా ఉంది. తన భర్త ట్యూషన్ల మీద రెండు చేతులా సంపాదిస్తున్నాడని మిగతా వాళ్ళకి మంటగా ఉంది. జగన్మోహనరావుకి ముగ్గురూ మగపిల్లలే కాబట్టి పెళ్ళిళ్ళ ఖర్చు తప్పించు కున్నాడని మిగతా వాళ్ళు కుళ్ళిపోతున్నారు. మనసుల్లో ఇంత కపటం, అసూయ పెట్టుకుని ఈ సంవత్సరీకం చేస్తే ఏమిటి? చెయ్యకపోతే ఏమిటి? ఇలా తగాదాలు పెటుకుని, కోడళ్ళు ఒకరికొకరు తిట్టుకుంటుంటే పైనున్న అత్తగారి ఆత్మ శాంతిస్తుందా, పుణ్యలోకాలకు వెళ్తుందా?

అక్కడ బయట....

జనార్ధనరావుకి కూడా ఆబ్దీకం తంతు విసుగు పుట్టిస్తోంది. రోజూ తొమ్మిదిన్నర కల్లా అన్నం తినేసి ఆఫీసుకి వెళ్ళేవాడు. ఇవాళ

కనీసం మధ్యాహ్నం మూడుగంటలయ్యేటట్టుంది. ఏం చేస్తాం తప్పదు...

శాస్త్రులుగారు సర్వేభ్యం... శ్రీ బ్రాహ్మణేభ్యో నమః... అంటూ ప్రార్థన చేసి, ఔపోసనం పట్టాడు.

"అగ్ని తెప్పించండి..."" చెప్పాడాయన. జనార్దనరావు కేకతో అతని భార్య వచ్చి నిప్పు అందించి వెళ్ళింది. శాస్త్రులుగారు ఆజ్యం విబాస్య అంటూ పాత్ర పరికల్పం చేశాడు. ప్రోక్షణ పాత్రం ప్రతిగృహ పాత్రం పూర్తయ్యాయి.

విశ్వేదేవ పితు ప్రపితామః అంటూ మహా విష్ణువుని ఆవాహన చేశాడు. తర్వాత అన్నం, భక్ష్యం, కూర, ఆజ్యంతో సర్వ ప్రాయశ్చిత్త హోమం చేశాడు.

"జంధెం మార్చుకోండి..." చెప్పాడాయన. జనార్ధనరావు ఆయన చెప్పినట్టే చేసి, శాస్త్రులుగారి పాదాలను నీళ్ళతో కడిగి, ఆయన చెప్పినట్టుగా సర్వకాలో భగవాన్, శ్రీ జనార్దన ప్రీతం అంటూ అర్ఘ్యం ఇచ్చాడు.

తర్వాత శాస్త్రులుగారు అన్నంచ, పాయసం, భక్ష్యం అంటూ అన్న శుద్ధి చేసి, మిగతా ముగ్గురు తమ్ముళ్ళని పిలిపించాడు. మళ్ళీ విడివిడిగా వాళ్ళ చేత సంకల్పం చెప్పించి, బియ్యం నువ్వులతో ఉదకం ఇచ్చి, ప్రోక్షణం చేసి స్వాహా దేవతల్ని ఆవాహన చేశాడు.

"భోక్తలు వచ్చారా?"

"వచ్చారు... సిద్ధంగా ఉన్నారు..." చెప్పాడు జనార్ధనరావు ఆనందంగా, భోక్తల ప్రస్తావన వచ్చిందంటే ఆబ్దీకం పూర్తయినట్టే.

"వంట పూర్తయిందా?"

"అయింది. మీదే ఆలస్యం.."

జనార్ధనరావు భార్య వచ్చి భోక్తలకి, శాస్త్రులగారికి విస్తళ్ళు వేసింది. మిగతా ముగ్గురు తోడి కోడళ్ళు వడ్డన ప్రారంభించారు.

భోజనాలు పూర్తయ్యాయి. తోడికోడళ్ళు పంతం కొద్దీ అత్తగారికి ఇష్టమని హల్వా, బొబ్బట్లు రెండూ చేయించారు.

శాస్త్రులుగారు పెసరపప్పుతో పాయస పిండం చేసి ప్రహరీ గోడమీద ఒక చోట ప్రోక్షణం చేసి దాన్నక్కడ పెట్టాడు. జనార్ధనరావు కాకా, కాకా అంటూ పెద్దగా దీర్ఘాలు తీస్తూ అరిచాడు. ఎక్కడనించో ఒక కాకి రివ్వున వచ్చి గోడమీద వాలి ఆపిండాన్ని కొంచెం కొంచెంగా తినడం ప్రారంభించింది.

పిల్లలందరూ ఆదృశ్యాన్ని కళ్ళువిప్పార్చుకుని చూసి చప్పట్లు కొట్టి ఎంతో ఆనందించారు.

నలుగురు అన్నదమ్ములు, వాళ్ళ పిల్లల భోజనాలు కూడా పూర్తయ్యాయి. శాస్త్రులుగారు భుక్తాయాసంతో ఒక ప్రేము కుర్చీలో జారగిలబడి కూర్చున్నాడు. అన్నదమ్ములు ఆయన పక్కనే కూర్చున్నారు.

"మొత్తానికి మీ అన్నదమ్ములు నలుగురూ కలిసి మీ తల్లిగారి సంవత్సరీకం నిర్విఘ్నంగా జరిపించారు. బాగుంది."

"మేం క్రమం తప్పకుండా చేస్తున్నాం శాస్త్రులుగారూ.." అన్నాడు జమదగ్ని.

"మంచిది.... మీ ఆడవాళ్ళు కూడ మంచి వాళ్ళు... ఎక్కడా ఏం వినుక్కోకుండా కార్యక్రమం నిర్వహించారు...."

"తోడికోడళ్ళు మధ్య అపారమైన ప్రేమాభిమానాలున్నాయ్. అందుకే ఏ పని చెప్పినా చిరునవ్వుతో చేసేశారు...." అన్నాడు జగన్మోహనరావు.

"మీ తండ్రిగారి ఆబ్దీకం ఎప్పుడు?"

"వైశాఖంలో... అది కూడా మీచేతుల మీదగానే జరిపించాలి..." అన్నాడు జస్వంత్.

"అదీ మీ ఇంట్లోనే నిర్వహిస్తారా జనార్ధనరావుగారూ..."

"ఓ తప్పకుండా.... నా తమ్ముళ్ళు నామాట కాదనరు. దేవిల్ సర్టన్లీ కోఆపరేట్ విత్‌మీ...'

"అవునవును..." అన్నాడు జమదగ్ని, భోంచేసి బైటికి వచ్చిన వదిన మరదళ్ళు వైపు చూస్తూ అతని మాటలు విని అతని భార్య చిరునవ్వు నవ్వింది.

"ఇహనే నొస్తాను..లేచాడు శాస్త్రులుగారు. అన్నదమ్ములు కూడా ఆయనకి వీడ్కోలు చెప్పడానికి లేచ్చారు.

అంతలో కొంచెం దూరంలో "మాతా అన్నపూర్ణేశ్వరీ, కొంచెం అన్నం పెట్టు తల్లీ.." అని ఓ బిచ్చగాడు కేకేశాడు. పక్కింట్లో ఎవరూ అతని కేక విని అన్నం పెట్టలేదు. అతను మెల్లిగా కదులుతున్న నీడలా జనార్దనరావు ఇంటి ముందు కొచ్చి గొంతెత్తి అలాగే అరిచాడు. చినిగిన చొక్కా, ధోవతి, పెరిగిన గడ్డం, భుజానికి జోలె... అతను భారతదేశంలోని దరిద్రానికి ప్రతీకలా ఉన్నాడు.

"ఇదుగో... అతనికొంచెం అన్నం కూరపెట్టవే" అన్నాడు. జనార్దనరావు.. అతని భార్య లోపలికి వెళ్ళి కొంచెం అన్నం, కూర పొంగలి తెచ్చి పెట్టింది.

"ఏం శుభకార్యం తల్లీ..." అడిగాడు వాడు పొంగలివైపు చూస్తూ.

"శుభకార్యం కాదు నాయనా... మా అత్తగారి ఆబ్దీకం..."

"ఆ తల్లి పేరేంటి తల్లీ..."

"నాగరత్నమ్మ..."

బిచ్చగాడు వెంటనే కళ్ళు మూసుకుని, తల పైకెత్తి రెండు నిమిషాలు ఏదో గొణుగుతూ ప్రార్థన చేశాడు.

"ఏవిటి ప్రార్థన చేస్తున్నావు?" అడిగింది జనార్ధనరావు భార్య నవ్వుతూ...

"నాకీపూట అన్నం పెట్టించిన ఆ తల్లి పేరు తలుచుకుంటున్నానండి. ఇయ్యేళ ఆవిడగారి ఆబ్దీకం కాబట్టి మనస్సుని ప్రశాంతంగా ఉంచుకుని ఆమె పేరు స్మరించుకుంటే చాలు... పుణ్యలోకాలకు వెళ్ళిపోతుంది ఆవిడగారి ఆత్మ. మీరు ఇయాళ మీ అత్తగారి పేరు నాకు మల్లె తలుచుకున్నారా, ఇంత ప్రశాంతంగా?"

ఆ ప్రశ్నతో శాస్త్రులుగారు ఆగిపోయారు. నలుగురి అన్నదమ్ములు, వాళ్ళ భార్యల మొహాలు వివర్ణమై పోయాయి. పిల్లలు ఆటలాడటం మానేసి అలా బొమ్మల్లా నిలబడిపోయారు. అవును, ఆబ్దీకం పెడుతున్నా తను తన తమ్ముళ్ళు, మరదళ్ళు ఎవరి ఆలోచనల్లో వాళ్ళుండి పోయారు. తమ్ముళ్ళు ఖర్చంతా తనమీద వేశారని తను బాధ పడ్డాడు. వాళ్ళసలు బైటికి తొంగి చూడలేదు. టీవీ చూస్తూ, వారపత్రికలు చదువుతూ కాలక్షేపం చేశారు. తోడికోడళ్ళు ఏదో విషయం మీద వాదించుకున్నారు. వాళ్ళ మాటలు తన చెవిన పడ్డయ్...

తాము తల్లిని స్మరించుకోలేదు. కోడళ్ళు అత్తగారిని జ్ఞాపకం చేసుకోలేదు. ఎవరి గొడవలో వాళ్ళుండి పోయారు తప్ప నాగరత్నమ్మ గారిని తలుచుకున్న పాపాన పోలేదు. అయినా పదిహేనొందలు మాత్రం ఖర్చయ్యాయి.

చనిపోయిన వాళ్ళని గుర్తు చేసుకోవడానికే పెద్దలు ఈ ఆబ్దీకాలు పెట్టారుగాని వాటి అసలు ఉద్దేశం నెరవేరడంలేదు. అలా నెరవేరనప్పుడు ఈ ఆబ్దీకాలు పెట్టి ఉపయోగం ఏవుంది? వట్టి మధ్యతరగతి హిపోక్రసీ తప్ప...?

శాస్త్రులుగారు నవ్వాడు, ఐదేళ్ళ క్రితం చనిపోయిన నాగరత్నమ్మగారిని తలుచుకొని.

జనార్ధనరావు అలా ఆలోచిస్తూ గోడమీద పిండం తింటున్న కాకివైపు చూశాడు.

అది ఎందుకో తినడం మానేసి అతనివైపు సూటిగా గుచ్చినట్టుగా చూసింది, క్రోధారుణ నేత్రాలతో.

*